


# ఢిల్లీ నశీహాంఛలో

కరుణ

కిష్టయ్య చౌదరి బుంగ మీసాలను గర్వంగా మెలివేస్తూ, తమ వూరి నుండి తెచ్చుకున్న లంక పొగాకును చుట్టచుట్టి, ఆ అనుభవానికి తను పడుతున్న ఆనందం చుట్టూ వున్న వాళ్ళకు లేదుకదా అని తలుచు కున్నపుడు ఆయన ఆనందం రెట్టింపయింది.

వొక్కగా నొక్క కూతురు. లంకపాలెం పన్నెండెకరాలు, బోదగుంట పొలం ఆరెకరాలు. ఇవిగాక గొడ్లూ – గోదా. కాలుమీద కాలేసుకుని పూళ్ళోవాళ్ళ వ్యవహారాలు సరిదిద్దగల పెద్ద భూస్వామి తాను. దూరా భారం అని యీ సంబంధానికి వెనకాడాడేగానీ అల్లుణ్ణి చూశాక సంబంధం వొదులుకోటం మంచిది కాదనిపించింది. ఇంజనీరు. ఢిల్లీలో వుద్యోగం. కాఫీ, టీ, సిగరెట్లు, ఆఖరుకు వక్కపొడి– యీ అలవాట్లేమీ లేవు. పిల్ల అదృష్టం. పొలం అమ్మిన సొమ్ము కొంత, అల్లుడి ఆఫీసులో అప్పు కొంతపెట్టి ఢిల్లీలో యిల్లు కొనుక్కున్నారు. గృహప్రవేశం అంటూ తానూ, తన భార్య వచ్చారు ఢిల్లీకి.

సంబరంబాగా జరిగింది. అక్కడే వుంటున్న తెలుగువాళ్ళు వచ్చారు. మనం, మన భాష, మన సాంప్రదాయం ఎంత గొప్పవి! ఇక్కడివాళ్ళు కూడా మంచివాళ్ళేగానీ ఏం మాట్లాడతారో మనకు అర్థంకాదు. ఇక్కడి ఆవులు మాత్రం మన ఆవుల్లాగే 'అంబా' అంటాయి. తొలిఝామున కూసే కోడి కూడా మన కోడి లాగానే 'కొక్కురోకో' అంటుంది. మరి మనుషులకే ఎందుకో యీ మాట తేడా?

చుట్ట అయిపోయింది. చటుక్కున యిల్లు గుర్తొచ్చింది. అవునూ, యిందాకటి వరకు యిక్కడేవున్న బాబిగాడు యేడి? వాడికోసం వెతుకుతూ పార్కంతా తిరిగాడు కిష్టయ్య. వాడు ఆటల్లోపడి పార్కు వదిలిపెట్టి పప్పూ, డబ్బూ (ఇది వాళ్ళ ముద్దు పేర్లు)లతో గిల్లీ – డండా (కర్రా – బిళ్ళ ఆట) ఆడటానికి వెళ్ళి చాలాసేపయింది. స్నేహితుల ఆట, తన గెలుపు – యివే వాడి దృష్టిలో వున్నాయి. తాతయ్య వొక్కడే పార్కులో వున్నాడన్న సంగతి వాడి మతిలో లేదు. చీకటిపడ్డాక గెంతుతూ యింటికెళ్ళా . 'తాతయ్యేడిరా?' అంటూ గడపలో నే నిల - తల్లి.

'నాకేం తెలుసు? యింటికి వచ్చాడని అనుకున్నాను.'

'ఎట్లా అనుకున్నావురా? తెలుగుతప్ప మరో భాష




తెలియ దాయనకు. ఇంటి దారి కూడా సరిగ్గా తెలుసో తెలియదో పద వెతుకుదాం' అంటూ సరళ కొడుకు జబ్బపట్టుకొని చరచర నడిచింది. గంటల తరబడి తిరిగినా ముసలాయన జాడ తెలియలేదు. ఇంటికొచ్చి విషయం విన్న కృష్ణమూర్తి ముసలాయనకోసం కంగారుపడుతూ తన స్నేహితులకు కబురెట్టి వాళ్ళకు కూడా ఆయనను వెతికే బాధ్యత అప్పజెప్పి స్కూటరేసుకొని బయల్దేరాడు. సరళ యేడుపును ఆపటం యెవరికీ సాధ్యంకాలేదు. ముసలమ్మ పరిస్థితీ అలాగేవుంది.

ఇక ముసలాయన అవస్థ. పార్కులో మనవడి కోసం గాలించాడు. వాడెక్కడా కనపడలేదు. 'ఇంటికే వెళ్దాం' అని బయల్దేరాడు. అన్ని యిళ్ళు ఒక్కమాదిరిగానే వున్నాయి. అంతపెద్ద జనక్‌పురిలో యే యిల్లు తమదని గుర్తుపట్టగలడు? ఆ ప్రాంతాన్ని 'జనక్‌పురి' అంటారని కూడా ఆయనకు తెలియదు. ఆయనకు అల్లుడి పేరు తెలుసు. ఇంజనీరని తెలుసు. అవే చెపుతూ రెండు కిలోమీటర్ల విస్తీర్ణంలో పిచ్చివాడిలా తిరిగాడు ముసలాయన. ఈయన చెప్పేది జనానికి అర్థంకాక 'బెచారా మద్రాసీ' అని జాలి కురిపించారు.

ఒకావిడ మాత్రం కాస్త శ్రద్ధచూపి కూతుర్ని పిలిచి 'మున్నీ, బాబాకో మద్‌రాసీ మామీకే పాస్ లే చలో' అని చెప్పి పంపింది. ముసలాయన్ని ఫర్లాంగు దూరం నడిపించి మామీ యింటికి తీసుకెళ్ళింది మున్నీ. ఆ మామీ మాట్లాడింది, మున్నీ మాట్లాడింది రెండూ అర్థంకాక అయోమయంగా రోడ్డెక్కాడు కిష్టయ్య చౌదరి.

చీకటిపడిపోయింది. ముసలాయన నడుస్తూనే వున్నాడు. కంటోన్మెంటు దాటి ధోలాకుఁవా వరకు వచ్చేసరికి ఎనిమిది దాటింది. అక్కడ దారులు చీలాయి. వాటిల్లో యే దారిన వెళ్ళాలో తెలియలేదు. యే దారైనా , గోదారేనని తలుచుకునేసరికి యేడుపొచ్చింది కిష్టయ్యచౌదరికి. ఇక కూతురింటికి వెళ్ళటం యీ మాయదారి వూళ్ళో సాధ్యం కాదన్న నిస్పృహ వచ్చింది. ఆకలితో పాటు దవడలు పీకుతున్నయ్యనిపించి జేబు వెతికాడు. వొక పొగాకు కాడ, అగ్గిపెట్టి దొరికినయ్యి. చుట్ట వెలిగించాడు. మళ్ళీ రోడ్డెక్కాడు. దట్టమైన చీకటి. రోడ్డుకూడా నిర్మానుష్యంగా వుంది. తిన్నగా నడుచుకుంటూపోతే రైల్వేస్టేషన్ వస్తుందని ఆయిన ఆశ. రెండు గంటలు నడిచేసరికి ఆయాసం వచ్చి కూలబడ్డాడు. దాహం వేసింది. ఎక్కడా బజారు పంపులు కూడా కనబడలేదు. ఇది వూరా – వల్లకాడా అని తిట్టుకున్నాడు. దూరంగా వొక బడ్డీకొట్టు కనపడింది. కొట్టుమనిషి దగ్గరకెళ్ళి దోసిలిపట్టి 'దాహం' అని సైగచేశాడు. అతను గ్లాసుడు మంచినీళ్ళిచ్చాడు. ఇంకో గ్లాసుకూడా అడిగి తాగి దాహం తీర్చుకున్నాడు. ఇక నడిచే వోపికలేక, పై పంచె నెత్తికిందపెట్టుకొని పడుకుందామని ప్రయత్నించాడు. నిద్ర రాకపోగా దుఃఖం ముంచుకొచ్చింది. తన వూరు, తన హోదా గుర్తొచ్చి బావురుమన్నాడు.

ఆ చీకట్లో, అలసటతో యిక నడవటం అసాధ్యం అని అక్కడే కూలబడ్డాడు. ముసలాయన రోడ్డుమీద, మిగతావాళ్ళు యింట్లో, యేడుస్తూనే గడిపేశారు రాత్రంతా. తెల్లారిన తర్వాత బడ్డీకొట్టు మనిషినే అడిగి కాసిని నీళ్ళతో ముఖం తడుపుకున్నాడు ముసలాయన. కొంచెం శక్తి వచ్చినట్లు అనిపించింది. కొంత దూరం నిర్మానుష్యంగా వున్నా మళ్ళీ యిళ్ళు కనిపించాయి. ఇళ్ళు దాటాక మార్కెట్. స్టేషన్ యింకెంత దూరం



వుంటుందో అని నిస్పృహగా వున్నా అడుగులు ముందుకు పడుతూనే వున్నాయి.

రోడ్డు పక్కగా తనలాగేవున్న ముసలాయన ప్లాస్టిక్ సబ్బుపెట్టెలు, దువ్వెనలు, అద్దాలు, బట్టలుతుక్కునే బ్రష్‌లు యింకా చిన్నా చితకా సామాను అమ్ముతూ కనపడ్డాడు. 'అయ్యా రైలు స్టేషను ఎంత దూరం?' అని అడిగాడు కిష్టయ్యచౌదరి. అతనికేం అర్థమయిందో గానీ రోడ్డు చూపించి యింకా ముందుకెళ్ళమన్నట్టు సైగచేశాడు. నడుస్తున్న రోడ్డు చీలింది. మళ్ళీ ఎటెళ్ళాలన్నా సమస్య. ఇందాకటి ప్రశ్నే యింకో మనిషిని అడిగాడు. ఆయన వొకదారి చూపించాడు.

మధ్యాహ్నం ఎండ పేలిపోతున్నది. రోడ్డుపక్క చెట్టుకింద బండి పెట్టుకొని బండిపైని పంపుతో నీళ్ళ గ్లాసులు నింపి అందరికీ అందిస్తున్నాడు బండి మనిషి. చలివేంద్ర అనుకొని రెండు గ్లాసుల నీళ్ళు తాగాడు. అయిసు నీళ్ళు చల్లగా వున్నాయి. బజారు పంపులు లేవని యీ ఏర్పాటు చేశారు అని తృప్తిపడి మళ్ళీ నడక మొదలెట్టాడు. బండిమనిషి పరిగెత్తుకొచ్చి చొక్కా పట్టుకొని 'పైసాదేకే చలో' అన్నాడు. ముసలాయన తెల్లబోయాడు. అతను చెప్పింది హిందీలోనే. అయినా డబ్బులు అడుగుతున్నాడు – అనేది అర్థం అయింది. సిగ్గుతో చచ్చిన ప్రాణాన్ని కూడదీసుకొని 'లేవు' అని సైగచేశాడు. అతను హిందీలో బూతులు తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. ముసలాయన జీవితంలో ఇటువంటి సంఘటన అనుభవంలోకి రావటం ఇదే ప్రథమం. పదిమందికి దానం చేసేవాడన్న పేరున్న తన కీ స్థితి! గిర్రున తిరిగిన కన్నీళ్ళను పైపంచెతో వొత్తుకున్నాడు. మళ్ళీ ప్రస్థానం మొదలయింది.

అలా రోజంతా నడిచినడిచి సాయంత్రం 8 గంటలకు న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ చేరుకున్నాడు కిష్టయ్య చౌదరి. కానీ బండెలా ఎక్కాలి? డబ్బు లేవీ? దిగాలుగా గోడ నానుకుని కూర్చున్నాడు వచ్చేపోయే వాళ్ళను చూస్తూ. టాక్సీ లొస్తున్నాయి. మనుషులు దిగుతున్నారు. స్టేషన్ లోపలికెళ్తున్నారు. బండి దిగినవాళ్ళు అలిసిపోయిన మొహాలతో, సామాన్ల బరువుతో బయటికొస్తున్నారు. రైళ్ళ రాకపోకల్ని గురించి ఎనౌన్సుమెంట్లు, జనం సందడి – వీటన్నిటి మధ్య వొక తెలుగుమాట వినపడింది. ముసలాయన రివ్వున గాలించాడు ఆ శబ్దం ఎటునుంచి వచ్చిందా అని. టాక్సీలో వున్న ముసలమ్మగారిని కొడుకు గాబోలు 'దిగమ్మా' అంటూ చెయ్యి అందిస్తున్నాడు. సామాన్లను కూలీలు దించుతున్నారు.

కిష్టయ్యచౌదరి ఆ తెలుగుమనిషి కాళ్ళను చుట్టేసి బావురుమన్నాడు.

"బాబూ నీకు ఎకరం పొలం రాసిస్తాను. నాకు బెజవాడకు టికెట్టు కొనిపెట్టి పుణ్యంకట్టుకోండి. ఈ దిక్కుమాలిన వూళ్ళో నేనుండలేను బాబూ" చిన్న పిల్లాడిలా వెక్కిళ్ళతో ఏడుస్తున్నాడు కిష్టయ్యచౌదరి. ఆ తెలుగాయన ఆయన్ని సముదాయించి అసలు సంగతేమిటని ఆరా తీశాడు.

"మా అల్లుడు కానూరి కృష్ణమూర్తి బాబూ. ఈ వూళ్ళోనే యింజనీరు. ఇల్లు కొనుక్కున్నాం, గృహప్రవేశం అంటే సంబరంగా వచ్చాం నేనూ, మా ఆవిడా. నా కర్మం యిలా కాలింది. దారి తప్పిపోయాను. ఎవర్ని అడిగినా నా కూతురింటి దారి చూపించలేకపోయారు. నాకేమో యీ భాషరాదు.

పార్కులో కే గందా అని పర్సు కూడా జేబులో పెట్టుకోకుండా వచ్చేశాను. నేను నా జీవితంలో యింతగా ప్రాధేయపడి ఎవరినీ అడగలేదుబాబూ. నే నబద్ధాల మనిషిని కాను. మీకు ఎకరం పొలం నిజంగా రాసిస్తాను. నన్ను రైలెక్కించండి బాబూ" అంటూ బావురుమన్నాడు ముసలాయన.

"చూడండి బాబుగారూ. మీ అల్లుడు అడ్రసు కనుక్కునే మార్గం మీకు చెపుతాను. ఇప్పటికే వాళ్ళు మిమ్మల్నిగురించి ఎంతగానో ఆదుర్దాపడుతూ వుండి వుంటారు. వాళ్ళని అలా వొదిలేసి మీరు బెజవాడ వెళ్ళటం సరైనపనికాదు. నేను వొకాయన అడ్రసు రాసియిస్తాను. ఆయన ఢిల్లీ ఆంధ్ర సంఘం సెక్రటరీ. పేరు పరమేశ్వరరావుగారు. ఆయనకి ఉత్తరం కూడా రాసిస్తాను. ఆయన కచ్చితంగా మీ అల్లుడి అడ్రసు సంపాదించి మిమ్మల్ని, మీ వాళ్ళనూ కలిపే ప్రయత్నం



చెయ్యగలడు. నా రైలుకు టైమయ్యింది. లేకపోతే నేనే మీతో వచ్చేవాడిని. ఆయన అడ్రసు ఇంగ్లీషులోను, హిందీలోనూ రాసిస్తున్నాను. ఈ కాయితం ఎవరికి చూపించినా మీకు దారి చూపిస్తారు. ఇక్కడికి ఎంతో దూరం కూడా లేదు ఆయన ఇల్లు. మీరు యేమీ తిన్నట్లు లేరు. ఈ అయిదు రూపాయలూ వుంచండి. పళ్ళయినా కొనుక్కుతినండి. పెద్దవారు. వేసవికాలం. సందేహించకండి. నన్ను మీ కొడుకు అనుకోండి" అంటూ అయిదు రూపాయల నోటు, అడ్రసు కాయితం యిచ్చాడాయన. ఇంకో కాయితం మీద చిన్న ఉత్తరం రాసి 'ఇది పరమేశ్వరరావుగారికి యివ్వండి' అని యిచ్చాడు. ఉత్తరం, అడ్రసు కాయితం మాత్రం తీసుకొని డబ్బు వద్దంటే వద్దన్నాడు కిష్టయ్యచౌదరి.

"బాబూ, మీ పేరు, మీ అడ్రసు కూడా యివ్వండి. మీ మేలు జన్మలో మరిచిపోలేను."

"నా పేరు రమేష్ నాయుడు. ఇదిగోండి నా అడ్రస్. నాకు టైమవుతోంది. మరి నే నొస్తాను" అంటూ అతను నమస్కరిన్చివెళ్ళిపోయాడు.

అప్పటికి రాత్రి తొమ్మిది గంటలయింది. అడ్రసు కాయితాన్ని దారిలో కనపడ్డవాళ్ళకు చూపెడుతూ, వాళ్ళు చూపిన దారినే నడిచి పరమేశ్వరరావు గారిల్లు చేరేసరికి 11 గం. దాటింది.

పరమేశ్వరరావుగారు ముసలాయనను ఆదరించారు. భార్య అరుణను పరిచయం చేసి 'మీ అమ్మాయే అనుకోండి. మీ వాళ్ళను, మిమ్మల్ని రేపటిలోగా కలుపుతాను. మీరు భోజనంచేసి విశ్రాంతి తీసుకోండి" అన్నారు.

కృష్ణయ్యచౌదరి భోజనం చెయ్యనని మొండికేశాడు. అరుణ బలవంతంతో కాఫీ మాత్రం తాగి పడుకున్నాడు. తెల్లారింది. పరమేశ్వరరావుగారు కె. కృష్ణమూర్తి అని వున్న తెలుగువాళ్ళ అడ్రసులన్నీ సేకరించారు మర్నాడు వుదయాన్నే. ఎందుకైనా మంచిదని పోలీసు రిపోర్టు కూడా యిచ్చారు.

అక్కడ సరళ, ముసలమ్మల పరిస్థితే దారుణంగా వుంది. వంట, తిండి సంగతి మర్చిపోయారు. పక్కనేవున్న తెలుగువాళ్ళు వండి తీసుకొచ్చిన భోజనం కృష్ణమూర్తి కాస్త నంజాడు. బాబిగాడికి తినిపించారు. కృష్ణమూర్తి స్నేహితుల సలహాతో పోలీస్ రిపోర్టు యిచ్చాడు. తలా వొక బండి తీసుకొని అతను, అతని స్నేహితులు ముగ్గురు ఢిల్లీలోని పోలీస్‌స్టేషన్లన్నీ తిరగటానికి బయల్దేరారు.

పరమేశ్వరరావుగారి ద్వారా వచ్చిన కబురు, పోలీస్‌స్టేషన్ నుండి వచ్చిన కబురు యించుమించు వొకేసారి చేరాయి. సరళను, ముసలమ్మను తీసుకొని కృష్ణమూర్తి పరమేశ్వరరావు గారింటికి చేరుకున్నారు సాయంత్రం అయిదు గంటలకు. అప్పటికి ముసలాయన తప్పిపోయి 48 గంటలయింది.

నవ్వులూ, ఏడుపులూ మధ్య అందరూ కలుసుకున్నారు. పరమేశ్వరరావు, అరుణగార్ల దగ్గర వీడ్కోలు తీసుకున్నాడు కృష్ణచౌదరి.

"బాబూ మీ మేలు యీ జన్మలో మరువలేను. ప్రాణాలో నా బిడ్డను తిరిగి చూస్తాననుకోలేదు. మీ రుణం ఎలా తీర్చుకోను?"

"అలా అనకండి చౌదరిగారూ. మా ఆంధ్ర సంఘానికి చందా యివ్వండి. మీలాంటి వాళ్ళు మరెవరైనా వస్తే ఆదుకోటానికి మా సంఘం వుండాలిగా!"

ముసలమ్మ చేతినుండి జత గాజులు తీసి యిచ్చాడు చందాగా ముసలాయన. వాటిని వద్దని పది రూపాయలు చాలన్నారు ఆంధ్రసంఘం సెక్రటరీగారు.

నెల రోజులుండి హరిద్వార్, రిషీకేష్ యాత్ర చేసుకుందామనుకొని వచ్చిన కృష్ణయ్య చౌదరిగారు వారం రోజుల్లోనే బయల్దేరాడు తిరుగు ప్రయాణానికి. ఆయన్ని ఆపటం ఎవరితరమూ కాలేదు. ●

